# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 70 వ భాగం

### అజామీళోపాఖ్యానం – 5

### విష్ణు, యమదూతల సంవాదం

అజామీళుడి ప్రాణం తీసే యమకింకరులని విష్ణుదూతలు అడ్డుకున్నాక ఆ దూతలు యమకింకరులని అసలు పాపపుణ్యాలనేవి ఎటువంటివి, ఎవరు నరకానికి వెళ్ళేది, ప్రపంచంలో అందరూనా లేకపోతే పాపాత్ములేనా అని అడిగారని క్రితం వ్యాసంలో చూసాం. ఇలా విష్ణుదూతలు అడిగేసరికి యమకింకరులు వాళ్ళకి తెలిసినది చెప్తున్నారు.

క. వేదప్రణిహితమే యను
మోదంబుగ ధర్మ మయ్యె మున్ను; త దన్యం
బేది యగునది యధర్మం
బాదియు హరిరూపు వేద మని విను కతనన్. [6-84]

వేదం అనేదానిలో ఏం చెప్పబడిందో అదే ధర్మం అంటున్నారు. ఏదైతే దీనికి అన్యమైనదో అదే అధర్మం అనీ చెప్తున్నారు, ఎందుకంటే వేదం శ్రీహరి రూపం అని వింటున్నాం కదా? (అంతర్బహిశ్చ నారాయణః, నారాయణ ఏవేదం సర్వం యద్భూతం, యశ్చభవ్యం... నారాయణోపనిషత్)

సీ. ఎవ్వనిచేఁ దన యిరవొందు త్రిగుణ స్వ;
భావమైనట్టి యీ ప్రాణిచయము
లనుగుణ నామక్రియారూపములచేత;
నేర్పడుగతిఁ దాన యెఱుఁగఁబడును
నర్యముం డనలంబు నాకాశమును బ్రభం;
జనుఁడు గోచయమును శశధరుండు
సంధ్యలు దినములు శర్వరీచయములుఁ;
గాలంబు వసుమతీ జాలములును [6-85]

తే. దేహధారికి సాక్షులై తెలుపుచుండు
దండనస్థాన విధము సద్ధర్మగతియుఁ
దగులు మీరీ క్రమానురోధనముఁ జేసి
యఖిల కర్ములు దండార్హు లరయ నెపుడు. [6-85.1]

భగవంతుడు ఏ త్రిగుణాలతో లోకాలలో ఉండే ప్రాణులలో అనేక నామరూపాలతో అంతర్గతంగా ఉన్నాడో ఆ భగవంతుడు సర్వాంతర్యామి. సూర్య చంద్రులు (ఆర్యముడు, శశధరుడు), ఆకాశం, రేయింపవళ్ళు, కాలం, భూమి ఇవన్నీ దేహం ధరించినవాడికీ, ఆ దేహధారి చేసే కర్మలకీ సాక్షులు. ఈ కర్మలన్నింటికీ శిక్ష పడేటపుడు ఈ సాక్షుల సమక్షంలో ధర్మాధర్మాలు నిర్ణయించబడతాయి. ధర్మనిర్ణయం చేస్తున్నప్పుడు అడ్డుతగిలారు కనక ఇప్పుడు మీరు కూడా శిక్షార్హులే. గమనించారా మనం చేసే కర్మకి సాక్షులెవరో? ఎవరూ చూడట్లేదు కదా అని తప్పు చేస్తే సాక్షులు ఒకరు కాదు, చాలామంది ఉన్నారు — పంచభూత, సూర్య చంద్ర, భూమ్యాకాశాలతో సహా.

బుద్ధుడికి జ్ఞానం కలగడానికి కొంతముందు మరుడు వచ్చి అడుగుతాడు, నువ్వు ప్రతీ జన్మలోనూ ధర్మం తప్పలేదని ఋజువు చూపించడానికి ఎవరైనా సాక్ష్యం ఉన్నారా అని ఆఖరి ప్రశ్నగా. కుడిచేయి భూమిమీద ఆనించి 'ఈ పుడమే నాకు సాక్షి' అని చూపించాడనీ, దానితో మరుడు ఓటమి ఒప్పుకుని జ్ఞానం కోసం అన్ని అడ్డంకులూ తొలగించాడని చెప్తారు. బుద్ధుడి మీద వేసిన కొన్ని చిత్రాల్లో ఈ విషయం చూడవచ్చు, గౌతముడు నేలమీద కుడి చేయి/వేలు వేసి ఇదే నాసాక్షి అని చూపించాడని చెప్పడానికి.

తే. కోరి కర్మంబు నడపెడు వారి కెల్ల
గలిత శుభములు నశుభము ల్గలుగుచుండు;
నరయఁగా దేహి గుణసంగి యైన యపుడె
పూని కర్మంబు జేయక మానరాదు. [6-86]

కావాలని కర్మ చేసేవారికి శుభాశుభాలు కలుగుతూ ఉంటాయి. అయితే త్రిగుణాలతో పుట్టిన దేహధారి కర్మ చేయకుండా కూర్చుంటానంటే కుదరదు. అలా కూర్చోలేడు కూడా.

క. ప్రకృతమునఁ దా నొనర్చిన
సుకృతము దుష్కృతము నెంత చూడఁగ నంతే
వికృతిఁ గని యనుభవించు
న్నకృతమతిం దత్ఫలంబు నతి నిపుణుండై. [6-87]

తాను చేసిన పుణ్య పాపాలకి ముందు ముందు అనుభవించాల్సి ఉంటుంది. ఏ విధంగా? అకృతమంతిం.. అంటే పరిపక్వం కాని మనసుతో. మనసు పరిపక్వం అయితే అసలు పాపపుణ్యాల ప్రసక్తే లేదు కదా?

వ. మఱియు వినుండు, జన్మంబు శాంత ఘోర మూఢ గుణంబులచేత నైనను, సుఖదుఃఖ గుణంబులచేత నైనను, ధార్మికాది గుణంబులచేత నైనను, సకల భూతంబులుఁ ద్రైవిధ్యంబు నే ప్రకారంబునం బొందు, నా ప్రకారంబున జన్మాంతరంబునం బొందుచుండు; దేవుండైన యముండు సర్వ జీవాంతర్యామియై

ధర్మాధర్మయుక్తం బయిన పూర్వ రూపంబుల మనస్సుచే విశేషంబుగఁ జూచుచుండి, వాని కనురూపంబులఁ జింతించుచుండు; అవిద్యోపాధి జీవుండు తమోగుణయుక్తుం డై ప్రాచీన కర్మంబులచేత నేర్పడిన వర్తమాన దేహంబు, నే నని తలంచుచుండి, నష్ట జన్మ స్మృతి గలవాడై పూర్వాపరంబు లెఱుంగం జాలకుండు; మఱియుఁ గర్మేంద్రియంబులచేతఁ గర్మంబులం జేయుచుండి, జ్ఞానేంద్రియముల చేతఁ దమోవిషయంబు లయిన శబ్ద స్పర్శ రూప రస గంధంబుల నెఱుంగుచుండి, పదియాఱవది యైన మనంబుతోఁ గూడి, పదియేడవవాఁ డగుచుండి, షోడశోపాధ్యంతర్గతుం డై యొక్కరుం డైన జీవుండు, సర్వేంద్రియ విషయ ప్రతిసంధానంబు కొఱకు జ్ఞానేంద్రియ కర్మేంద్రియ మనోవిషయంబులఁ బొందుచుండి, షోడశ కళలు గలిగి, లింగ శరీరం బనం బరఁగి గుణత్రయకార్యం బను నిమిత్తంబున హ ర్ష శోక భయంబుల నిచ్చుచున్న సంసారంబు ధరియించుచుండు; విజిత షడ్వర్గు డైన దేహి కర్మంబు లొల్లని బుద్ధి నెఱింగియు, వినియుఁ, గర్మంబులు జేయుచుండి, తన సంచార కర్మంబునం జుట్టుకొన్న పసిడికాయ పురువునుం బోలె నిర్గమోపాయం బెఱుంగక నాశంబు నొందుచుండు, వర్తమాన వసంతాది కాలంబు, భూత భావి వసంతాది కాలయోగ్యం బైన పుష్ప ఫలాదులు తత్కాల జ్ఞాపకంబు నెట్లు జేయు, నట్లు భూత భావి జన్మంబులకు ధర్మాధర్మంబులు నిదర్శనంబులు జేయుచుండు; ఒక్క నరుండు నొక క్షణంబును గర్మంబు జేయకుండువాఁడు లేఁడు; పూర్వసంస్కారంబులం గల గుణంబులచేతఁ బురుషుం డవశుండు గావున బలిమిఁ గర్మంబులు చేయింపంబడుచుండు; అవ్యక్తనిమిత్తంబు నొంది తదనురూపంబు లయిన స్థూల సూక్ష్మ శరీరంబులు మాతా పితృ సదృశంబు లగుచుండు; ఇట్టి విపర్యయంబు పురుషునికిఁ బ్రకృతి సంగమంబునం గలుగుచుండు; ఆ ప్రకృతి పురాణపురుషుం డయిన యప్పరమేశ్వరుని సేవించినం దలంగుచుండు.

[6-88]

మన జన్మలు మూడు రకాలుగా ఉంటాయిట – శాంత ఘోర మూఢ గుణంబులచేత. అంటే కొంతమంది శాంత స్వరూపులు, కొంతమంది మూఢులు, మిగతావారు ఘోరమైనవారు. చేసిన పూర్వ కర్మలనిబట్టి ఈ గుణాలు అలవడుతూ ఉంటాయి. త్రిగుణాలతో కలిసి "నేను" అనే భావం ఏర్పడి కర్మలు చేస్తూ ఉంటాడు. ఈ జన్మలో నడవడి బట్టి క్రితం జన్మలో ఎలా ఉండేవాడో, వచ్చే జన్మ ఎలా ఉంటుందో చెప్పవచ్చు. అయితే అసలు కర్మ చేయననడం ఎందుకు కుదరదంటే, క్రితం చేసిన పూర్వకర్మలు దేహధారిని పట్టి పీడించి మరీ చేయిస్తాయి ఈ కర్మలని. ఈ విషయంలో పట్టుపురుగు తన చుట్టూ గూడు అల్లుకుని అందులో నశించినట్టే, మనం కూడా ఒక జన్మతర్వాత మరో జన్మలో పుడుతూ నశిస్తున్నాం. అలా కర్మ చేయకుండా ఉన్న మానవమాత్రుడెవడూ లేదు. అయితే వీటన్నింటికీ సాక్షి జీవిలో ఉండే మా దేవుడైన యముడు (పితౄణామర్యమా చాస్మి, యమః సంయతామహం... భగవద్గీత విభూతి యోగం). ఇటువంటి బంధనం అయిన – దేహధారికి ప్రకృతి సంగమం వల్ల కలిగే – సంసారం వదిలించుకోవడానికి ఒకే ఒక దారి, పరమేశ్వర సేవనం. ఈ వచనంలో సింగయ పోతనకంటే తానేం తక్కువ కాదని చూపించాడు చూసారా?

సీ. కావున నితఁడు సత్కర్మ వర్తనమున;
భూదేవకులమునఁ బుట్టినాడు;
దాంతుఁడై శాంతుఁడై ధర్మసంశీలుఁడై;
సకల వేదంబులఁ జదివినాఁడు;
అనయంబు గురువుల నతిథులఁ బెద్దలఁ;
జేరి శుశ్రూషలఁ జేసినాఁడు;
సర్వభూతములకు సమబుద్ధియై చాల;
బహు మంత్ర సిద్ధులఁ బడసినాఁడు; [6-89]

తే. సత్యభాషణ నియమంబుఁ జరపినాఁడు;
నిత్యనైమిత్తికాదుల నెఱపినాఁడు;
దండి లోభాది గుణములఁ దరపినాఁడు;
మంచిగుణములు దనయందు మరపినాఁడు. [6-89.1]

ఇంత చెప్పాక ఇప్పుడు ఈ అజామీళుడి గురించి చెప్తున్నారు. పూర్వకర్మ వల్ల మంచి కులంలో పుట్టాడు. శాంత స్వభవుడూ, ధర్మశీలుడై వేదాలు చదివాడు. అతిథులనీ గురువులనీ గౌరవించాడు. మంత్రసిద్ధులన్నీ పట్టుబట్టాడు. సత్యభాషణంతో నిత్యకర్మలన్నీ, మంచి గుణాలతో చేసేవాడు.

క. సతతాచార సమంచిత
మతియై సుజ్ఞానమునకు మరగెడు తఱి నా
యతగతి నాతని కంగజ
మతమై నవయౌవనాగమం బెడ జొచ్చెన్. [6-90]

ఇదంతా యవ్వనం (అంగజ మతము – మన్మధుడి విధానం) వచ్చేదాకానే. యవ్వనం రాగానే ఏమౌతుందో మనకి తెలిసినదే కదా? ఇప్పటివరకూ చేసిన కర్మలని, ఇవెందుకు చేయాలి అనడం, వీటివల్ల ఏమీ ఉపయోగం లేదనడం, ఎక్కడో ఉన్న భగవంతుడు నాకేం చేస్తాడనడం, మదం, ఉద్రేకం వచ్చి చేరడం వగైరా.

ఆ సమయంలో అజామీళుడు యవ్వనంలో ఉన్న ఒక వెలయాలిని చూసాడు. కామోద్రేకం ప్రబలింది. దాంతో మిగతావన్నీ మర్చిపోయి ఆవిడ తోటే లోకం అన్నట్టూ గడపడం మొదలుపెట్టాడు.

త. బహుళ దృక్పరిపాక మోహ నిబద్ధుఁ డౌచు మనంబులో
సహజ కర్మము వేదశాస్త్రము సాత్త్వికంబుఁ దలంచి త
న్నిహిత చిత్తము పట్టి పట్టఁగ నేరఁ డయ్యె సదా మనో
గహనమందు మరుండు పావకు కైవడిం జరియింపగాన్. [6-103]

సదా ఆవిడ మోహంలో కొట్టుమిట్టాడుతూ గడుపుతూంటే మన్మథుడు అగ్నిలా దహిస్తూంటే చిత్తం పట్టుతప్పింది. నేర్చుకున్న సహజ కర్మలూ, జప తపాలూ, వేద పాఠాలు అన్నీ మర్చిపోయాడు.

ఉ. బంధులఁ దిట్టి సజ్జనులఁ బాధలఁ బెట్టి యనాథకోటిఁ బెం
బందెలు చుట్టి యీరములు పట్టి పథంబులు గొట్టి దిట్టయై
నిందల కోర్చి సాధులకు నిందితుఁడై గడియించు విత్త మా
సుందరి కిచ్చి మచ్చికలు సొంపెదఁ గూర్చి వసించెఁ దత్కృపన్. [6-107]

చివరికి పరిస్థితి ఎక్కడకి వచ్చిందంటే, బంధువులనీ, సజ్జనులని, అనాథులనీ పీడించి, డబ్బుకోసం దారి కాసి మనుషులని కొట్టడం చేసి ఆ డబ్బులన్నీ తీసుకొచ్చి చేరదీసిన సుందరికి ఇచ్చేవాడు. ఇక్కడోసారి ఆగి అవలోకనం చేసుకుంటే అజామీళుడి జీవితానికీ మనకీ కొంతవరకూ పోలికలు కనిపిస్తాయి.

క. అటు గాన పాపకర్మునిఁ
గుటిలుని సుజనార్తు ధూర్తుఁ గ్రూరుని నే మా
రటమునఁ గొని యేగెద మం
తట దండమువలన నితఁడు ధన్యత నొందున్. [6-109]

ఇటువంటి పాపకార్యాలు చేసిన కుటిలుణ్ణి, ధూర్తుణ్ణి, క్రూరుణ్ణి మేము తీసుకెళ్తున్నాం. మా వల్ల శిక్ష అనుభవించాక ధన్యుడవుతాడు. ఇప్పుడు చెప్పండి ఇతణ్ణి ఎందుకు నరకానికి తీసుకెళ్ళకూడదో?

దీనికి విష్ణుదూతలు ఏమని సమాధానం చెప్తారో వచ్చే వ్యాసంలో.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS